క్లుప్తంగా

పిల్లల వైద్య విభాగాధిపతిగా డాక్టర్ దేవకుమార్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగాధిపతిగా డాక్టర్ బి.దేవకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన డాక్టర్ పద్మలత శుక్రవారం పదవీ విరమణ చేశారు. దీంతో డాక్టర్ దేవకుమార్‌ను ఇన్‌చార్జి విభాగాధిపతిగా నియమిస్తూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను డాక్టర్ దేవకుమార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా కలిశారు. నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శ్రద్ధ చూపించాలని సూపరింటెండెంట్ సూచించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా కథలు చెప్పారు. అనంతరం గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఖో–ఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ పూజలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారం చేపట్టాలని కోరుతూ ప్రోగ్రెసివ్ స్టేట్ టీచర్స్ యూనియన్ (పీఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసీవీ గురువారెడ్డి శనివారం పట్టాభిపురంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోరే మనసున్న మంచి ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాటు జనరంజక పరిపాలన అందించారని తెలిపారు. ఈనెల 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో ఆయనకు విజయం చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థించారు.

హోటల్ యజమానిపై కేసు నమోదు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా బాలురతో పని చేయిస్తున్న హోటల్ యజమానిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైల్డ్ రైట్స్ ఫౌండేషన్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం నగరంలో దాడులు నిర్వహించారు. ఆర్. అగ్రహారంలోని అరుణ బిర్యాని పాయింట్‌లో ఇద్దరు బాల కార్మికులను గుర్తించారు. వారిని చైల్డ్ లైన్ అధికారులు వసతి గృహానికి పంపి, యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గేటు సమీపంలోని మురుగు కాల్వలో ఓ మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని కాల్వలో నుంచి బయటకు తీయించారు. వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటాయని గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ



ఫిరంగిపురం: స్థానిక గాలి బాలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణలో భాగంగా శనివారం పుస్తకాలు చదవడం, చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షకుడు సుందరరావు మాట్లాడుతూ చారిత్రక పుస్తకాలు చదవడం వల్ల రాజులు, పరిపాలించిన ప్రాంతాలు, అప్పటి పరిస్థితులు, జీవనశైలి గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. బొమ్మలు గీయడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్, డి.కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వెంగళాయపాలెంలో కార్డన్ సెర్చ్

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ శనివారం నిర్వహించారు. నల్లపాడు పోలీసులు తనిఖీలను చేపట్టారు. పది బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జై శ్రీరామ్.. జై హనుమాన్

- నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- అత్యంత వైభవంగా హనుమత్ జయంత్యుత్సవాలు
- గుంటూరు నగర, శివారుల్లోని ఆలయాల్లో బారులుతీరిన భక్తులు



కొత్తపేట శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో బారులుతీరిన భక్తులు



స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



కొత్తపేట శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామికి అభిషేకం



ఏటుకూరు రోడ్డులోని ఆలయంలో తులసి పూజ

నగరంపాలెం: గుంటూరు నగర, శివార్లల్లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమత్ జయంత్యుత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాల్లో జై శ్రీరామ్.. జై హనుమాన్ నామస్మరణంతో మారుమోగాయి. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి బారులుతీరారు. భక్తిప్రవత్తులతో, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

- కొత్తపేట శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం మూలిక ద్రవ్యాలు, పాలాభిషేకాలతో శ్రీ స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. దేవస్థానానికి భక్తులు వేకువ జాము నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కుండలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాస్, చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ముఖ్య అర్చక శ్రీ హనుమాన్ దీక్ష సమాజం గౌరవ అధ్యక్షుడు తిరువల్లూరి వెంకటసుబ్బారావు, సభ్యులు నాగేశ్వరరావు, అనిల్ కుమార్, వంశీ, జగదీష్, రమేష్, రమణ పాల్గొన్నారు. దాతల సహకారంతో భక్తులకు ప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ ఉచితంగా అందించారు.
- ఏటుకూర్ రోడ్డులోని శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయస్వామి 22వ బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. హనుమత్ జయంతి సందర్భంగా మహా పూర్ణాహుతి, స్వామికి ప్రత్యేక అలంకారంలో విశేష పూజలు చేపట్టారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, టీడీపీ, జనసేన నాయకులు కన్నా లక్ష్మీనారాయణ, బోనబోయిన శ్రీనివాసయాదవ్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 79 కిలోల లడ్డూని వేలంపాటలో పరశు యాదవ్ దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు. సాయంత్రం సువర్చలా సమేత అభయాంజనేయ స్వామికి శాంతి కల్యాణాన్ని వేదమంత్రాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు, ఉత్సవాలకు సహకరించిన దాతలు, భక్తులు, కార్యవర్గ సభ్యులకు, రుత్వికలకు ఆలయ పాలకమండలి, బ్రహ్మశ్రీ రాజ కుమార్‌శర్మ బృందం ధన్యవాదాలు తెలిపింది.

మల్లికార్జునపేట శివాలయంలో పూజలు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలోని హనుమంతుని విగ్రహానికి ఆలయ ప్రధాన అర్చకస్వామి చంద్రశేఖర శర్మ పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం తమలపాకులతో సహస్ర నామార్చన జరిపారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.



మల్లికార్జునపేటలోని శివాలయంలో విశేష అలంకరణలో స్వామి

ఆకట్టుకున్న హనుమత్ వైభవ ప్రవచనం



పూజల్లో పాల్గొన్న నారాయణమూర్తి , మస్తానయ్య, సత్యనారాయణ, లలితాంబ దంపతులు

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు. సుందరకాండలోని హనుమత్ వైభవంపై నారాయణమూర్తి ప్రసంగించారు. సుందరకాండ లోని ప్రతి అంశాన్నీ వాల్మీకి మహర్షి సుందరంగా వర్ణించారని చెప్పారు. స్వామికి విశేష అభిషేకాలు, నాగవల్లి దళార్చన, అలంకరణతో పాటు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లే పల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, పుట్టగుంట ప్రభాకర్, రత్నకుమారి దంపతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్



చెక్కులను అందజేస్తున్న వీసీ పార్థసారథివర్మ, ఏసీఐసీ సీఈవో రమణ్‌కాంత్ తదితరులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్ శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్సిటీ వైస్ చైర్మన్ డాక్టర్ జి. పార్థసారథివర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో నూతన ఆవిష్కరణల వ్యవస్థాపకత ప్రయాణంలో ముఖ్యమైన మైలురాయి ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్ అని పేర్కొన్నారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ అనే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం కింద నూతన ఆవిష్కరణలు చేపట్టిన వారికి నిధులు ఇస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆవిష్కరణలు చేపట్టిన వారిని దరఖాస్తులు చేసుకోమని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు కేఎల్‌యూలోని ఏసీఐసీ ప్రకటన జారీ చేసినట్లు చెప్పారు. దీంతో దేశవ్యాప్తంగా 800 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంక్యుబేటర్ సీడ్ మేనేజ్‌మెంట్ కమిటీ సూచనల మేరకు కేఎల్‌యూలో ఏసీఐసీ కమిటీ అర్హత సాధించిన విజేతలకు నిధులు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా నూతన స్టార్టప్ యజమానులకు చెక్కులు పంపిణీ చేశారు. ఏసీఐసీ సీఈవో రమణ్‌కాంత్ మాట్లాడుతూ యుక్తి, స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ అనే రెండు కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు గ్రాస్ రూట్ ఇన్నోవేటర్స్ ఐడియాథాన్‌లు అనే మూడు పథకాల కింద స్టార్టప్‌లకు మొత్తం రూ. 45 లక్షల నిధులను పంపిణీ చేసినట్లు తెలిపారు. యువత ఉద్యోగాల కోసం తిరగడానికి స్వస్తి పలికి పది మంది ఇచ్చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. చదువుకున్న యువత విదేశాలకు వెళ్లాల్సిన పని లేకుండా ఏసీఐసీ ద్వారా నూతన ఆవిష్కరణలు కనుగొని నిధుల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకటరామ్, కుర్రా రాజశేఖర రావు, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, సీఐఐఈ డైరెక్టర్ నరసింహరాజు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషిచేయాలి



మంగళగిరి: మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించి నిర్మూలనకు కృషిచేయాలని మంగళగిరి యూనిట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీమన్నారాయణ తెలిపారు. మలేరియా నిర్మూలన మాసోత్సవాల సందర్భంగా శనివారం వైద్యులు, సిబ్బంది ప్రభుత్వాసుపత్రి నుంచి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇళ్ల చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. డ్రెయిన్లలో మురుగు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలున్న చోట్ల దోమలు పెరిగి మలేరియా సోకుతుందని తెలిపారు. ఖాళీ స్థలాలలో మురుగు నిల్వకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం. సాగర్, టి. సైదులు, హెల్త్ అసిస్టెంట్లు నరసింహారావు, మూర్తి, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు వ్యర్థాలతో అవస్థలు



తెనాలిరూరల్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డులో నుంచి వస్తున్న వేస్టేజీ వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని డంపింగ్ యార్డు చుట్టు పక్కల పొలాల రైతులు తెలియజేశారు. శనివారం డంపింగ్ యార్డును సందర్శించిన వారు అక్కడ పరిస్థితులను, తమ ఇబ్బందులను విలేకర్ల ఎదుట ఏకరువు పెట్టారు. ఎంతో కాలంగా ఇక్కడ ఉన్న డంపింగ్ యార్డు గోడలు పడిపోయి దాంట్లోని వ్యర్థాలు, వ్యర్థాల నీరు తమ పొలాల్లోకి వచ్చి చేరుతుందన్నారు. అందువల్ల తాము పంటలు కూడా వేయలేక పోతు న్నామని చెప్పారు. స్పందనలో ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో సాగు ప్రారంభకానున్న నేపథ్యంలో అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలి రూరల్: హైదరాబాద్ జేఎన్టీయూ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ డైరెక్టర్ కన్నెగంటి రమేష్‌బాబు జన్మదిన వేడుకలను శనివారం స్థానిక మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమంలో నిర్వహించారు. ఆశ్రమ వాసులకు స్వీట్స్ పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది పొన్నం విజయకుమార్, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కన్నెగంటి గోపీచంద్, తోట సూరిబాబు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్ట్



తెనాలిరూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలను తెనాలి ఎస్ఈబీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం వెల్లడించారు. పట్టణ మారిస్‌పేట స్వతంత్ర విహార్ హోటల్ సమీపంలో 96 మద్యం క్వార్టరు సీసాలను తరలిస్తూ ముగ్గురు యువకులు ఎస్ఈబీ అధికారులకు చిక్కారు. పరిమితికి మించి తీసుకెళుతుండడంతో వారిని ప్రశ్నించగా మద్యం దుకాణంలోని సేల్స్‌మ్యాన్ సహకరించినట్టు తెలిపారు. దీంతో నిందితుడితో పాటు సేల్స్‌మ్యాన్‌ను అరెస్ట్ చేసినట్టు సీఐ వివరించారు.

ఐతానగర్‌లో కార్డన్ సెర్చ్



తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎటువంటి ఘర్షణలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా తెనాలి పట్టణ ఐతానగర్‌లో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్, వన్ టౌన్ సీఐ జి. దశరధరామారావు, రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు, ఇతర ఎస్ఐలతో పాటు దాదాపు 70 మంది సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడ వద్దని, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైక్‌లలో హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలను లేని 25 బైక్‌లు సీజ్ చేశారు. సరైన పత్రాలు చూపిస్తే వాటిని రిలీజ్ చేస్తామని రూరల సీఐ సుధాకర్ తెలియజేశారు.

దుకాణం కూల్చివేతపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: దుకాణం కూల్చివేతపై నల్లపాడు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు.. గోరంట్ల గ్రామానికి చెందిన మరియమ్మ హోసన్న మందిర్ సమీపంలో రోడ్డు పక్కన శ్రీకనకదుర్గ అమ్మవారి ఫొటోలతో చిన్న ఆలయాన్ని ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తూ ఉండేది. ఈ క్రమంలో పదేళ్ల కిందట రోడ్డు విస్తరణలో భాగంగా ఆలయాన్ని కూల్చి వేయాల్సి రావటంతో వెనుకే ఉన్న ప్రైవేటు స్థలంలో చిన్న బంకును ఏర్పాటు చేసి అందులో అమ్మవారి ఫొటోలను ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తుండేది. ప్రైవేటు స్థలంలో అమ్మవారి ఫొటోలతో ఆలయ ఏర్పాటుపై గతంలో వివాదం కాగా, కోర్టులో కేసు నడుస్తోంది.

ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు అమ్మవారి ఫొటోలతో పూజలందుకుంటున్న కొట్టును కూల్చివేశారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాకుమాను పుష్పావతీదేవికి నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు 'గానవిశారద' కాకుమాను పుష్పావతీ దేవి 18వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా గాంధీ సేవాశాంతి ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పుష్పావతీ దేవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచారు. సంగీత విద్వాంసురాలుగా, స్వాతంత్ర్యయోధురాలుగా ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆమె స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కుర్రా వెంకటేశ్వరరావు, వై.కోటేశ్వరరావు, యోగాచార్య పి.కుటుంబరావు, ఆశ్రమవాసులు పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



విద్యార్థులతో వీరయ్య, రత్నబాబు, శివన్నారాయణ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈసెట్ ఫలితాల్లో జీవీఆర్ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ తురకా వీరయ్య తెలిపారు. బ్రాడీపేట రెండో లైనులోని సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత నెల 8న జరిగిన ఏపీ ఈసెట్ ఫలితాల్లో సీఎస్ఈ విభాగం నుంచి జె. వెంకటేశ్వర్లు 132 మార్కులతో రాష్ట్రస్థాయిలో 66వ ర్యాంకు, ఎం. దీప్తిక 218, సీహెచ్ సారిక 345, కె. రోహిణి ప్రియంవద 381, షేక్ వానిష్మా 619, ఎం.లహరి 918, సీహెచ్ రాజశేఖరరెడ్డి 944 ర్యాంకు సాధించారని వివరించారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి తెలంగాణ ఈసెట్‌లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 51వ ర్యాంకు, ఏపీఈసెట్‌లో 206వ ర్యాంకు సాధించారని తెలిపారు. ఈసీఈ విభాగంలో ఎస్. వెంకటరమణ 297, జి. రమ్యశ్రీ 744, షేక్ నాగూర్‌బాషా 916, జి. హరికృష్ణ 982, కె. భావన 1006వ ర్యాంకుతో పాటు సివిల్ విభాగంలో ఎం. జయరాజ్ 975, మెకానికల్ విభాగంలో సూర్య రోహిత్ 712వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థుల్ని ప్రొఫెసర్ రత్నబాబు, డైరెక్టర్ వీరయ్య, స్ఫూర్తి కాంపిటీషన్స్ డైరెక్టర్ శివన్నారాయణ, అధ్యాపకులు ఓ. శ్రీనివాసులు, వి. అమలదాసు, ఎన్. శ్రీను పాల్గొన్నారు.

పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం



సభలో మాట్లాడుతున్న ఇందుశేఖర్

లక్ష్మీపురం: పొగాకు వినియోగం వల్ల తలెత్తే దుష్పరిణామాలపై పెద్దఎత్తున అవగాహన కల్పించి, ప్రజలు దాన్నుంచి బయటపడేలా ప్రభుత్వాలు సమర్థ చర్యలు తీసుకోవాలని హెల్త్ అవేర్‌నెస్ అధ్యక్షుడు అచ్యుత ఇందుశేఖర్ కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా 'ప్రజారోగ్యాన్ని గుల్ల చేస్తున్న పొగాకు' అనే అంశంపై జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ప్రతి వంద అర్ధంతర మరణాల్లో పదింటికి పొగాకు వాడకమే కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ తేల్చిందనే తెలిపారు. భారత్‌లో మరణిస్తున్న పది లక్షల మందిలో 3.5 లక్షల మంది పొగాకు బాధితులేనని చెప్పారు. పొగాకు వినియోగం వల్ల సుమారు 25 రకాలకు పైగా క్యాన్సర్లు వ్యాపించి, ప్రాణాన్ని హరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య ప్రచారకులు బి. నారపరెడ్డి, యోగాచార్యులు కొండయ్య మాస్టారు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు లక్ష్మి, సదాశివం, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థం విక్రయం కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితులతో సెబ్-2 సీఐ లత

నగరంపాలెం: మత్తు పదార్థం విక్రయం కేసులో ఇద్దరని ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–2 స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.18 వేలు ఖరీదు చేసే ఎండీఎంఏ అనే మత్తు పదార్థం స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులోని సెబ్–2 స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను సీఐ బి.లత వివరించారు. సెబ్ జిల్లా ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ముందస్తు సమాచారంతో శనివారం చుట్టుగుంట వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. కేవీపీ కాలనీకి చెందిన సయ్యద్ అష్రఫ్ అలీ, శ్రీనివాసరావుపేటకు చెందిన పసుపులేటి భానుప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని, వారి వద్ద మూడు గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థాన్ని గుర్తించారు. వీరిలో అష్రఫ్ అలీ బెంగళూరు నుంచి దాన్ని తీసుకొచ్చేవాడని, ఎక్కువ మొత్తంలో విక్రయించి సొమ్ము చేసుకునేవారని విచారణలో వెల్లడైంది. ఇక అతని వద్ద ఉన్న కారు డ్రైవర్‌గా భానుప్రకాష్ పని చేసేవాడు. అష్రఫ్ అలీపై నగరంపాలెం పీఎస్‌లో కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి మూడు గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థాం, మోటారు సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. సమావేశంలో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ సీఐ భాను సత్యనారాయణ, సెబ్ –2 ఎస్ఐ రహిమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న వాహనాలు దగ్ధం



నల్లపాడు స్టేషన్ ఎదుట దగ్ధమవుతున్న వాహనాలు

గుంటూరు రూరల్: నల్లపాడు పోలీసులు గతంలో అదుపులోకి తీసుకుని స్టేషన్ ఎదుట నిలిపిన వాహనాలు శనివారం ప్రమాదవశాత్తూ దగ్ధమయ్యాయి. సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ సమీపంలోని ముళ్లపొదలు, చెత్తచెదారం నిప్పు పెడుతుండడంతో ప్రమాదవశాత్తూ వాహనాలు దగ్ధమైనట్లు భావిస్తున్నట్లు చెప్పారు. వెంటనే స్పందించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా మంటలను ఆర్పివేశారని ఆయన తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మలేరియా రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



ర్యాలీలో అధికారులు సిబ్బంది

తెనాలి రూరల్: పట్టణంలోని వివిధ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలను శనివారం నిర్వహించారు. మలేరియా రహిత సమాజం ఏర్పాటు ఉద్దేశంతో ఏటా జూన్ మాసాన్ని వ్యతిరేక మాసోత్సవంగా పరిగణించి వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తెనాలి పట్టణంలోని మలేరియా, ఫైలేరియా విభాగాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిపి అవగాహన ర్యాలీలను నిర్వహించాయి. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి ధరావత్ రాజునాయక్ మాట్లాడుతూ మలేరియా రహిత సమాజం ఉండాలన్న సంకల్పాన్ని నెరవేర్చే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వైద్యాధికారులు డాక్టర్ దివి కిషోర్ కుమార్, డాక్టర్ బీబీ జాన్, తెనాలి పట్టణ ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వైద్యాధికారులు డాక్టర్ మోనిక కుమార్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ దేవికావాణి, డాక్టర్ మహిత, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్స్‌పెక్టర్ జి.రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు దాసరి మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల శివరామప్రసాద్, పుష్పలత, ఆరోగ్య కార్యకర్తలు రషీద్, నవీద్, రత్నాకర్, భాషిత్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు లక్ష్మీప్రసన్న, అంకమ్మ, జోస్పిన్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.